




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 151 | శనివారం 8 నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50




### రాజ్యాంగంపై

## బీజేపీ, ఈసీ దాడి

◆ఓట్ల చోరీతోనే మోడీ ప్రధాని అయ్యారు

◆రాహుల్ గాంధీ విమర్శలు?

**న్యూఢిల్లీ, సూర్యవాస్తవం:** రాజ్యాంగంపై ఎన్నికల సంఘం, బిజెపి కలిసి దాడి చేస్తున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశంలో ఎన్నికలను కమలం పార్టీ దొంగతనం చేస్తోందని, ఓట్లు చోరీ చేయడంతోనే నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారని అన్నారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి ఎన్నికలను ఎలా దొంగిలిస్తుందనే విషయాన్ని దేశ యువతకు, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆధారాలతో చూపిస్తుందని అన్నారు. ఓట్ల చోరీపై ఇప్పటి వరకు బిజెపి, ఇసి స్పందించలేదని విమర్శించారు. ఓట్ల చోరీపై తమ దగ్గర చాలా సమాచారం ఉందని తెలిపారు. హర్యానాలో హోల్‌సేల్‌గా ఓట్ల చోరీ జరిగిందన్నారు. బీహార్‌లోనూ ఇదే పునరావృతం కాబోతోందని చెప్పారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లోనూ ఇదే జరిగిందని వివరించారు. ఓట్ల చోరీపై

- మిగతా 2లో..

# శ్రీచరణికి రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం

◆ గ్రూప్ 1 ఉద్యోగం, ఇంటి స్థలం

◆ ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ ◆ స్వాగతం పలికిన లోకేష్

**అమరావతి, సూర్య వాస్తవం**

మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన శ్రీచరణి, ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారిణికి భారీ నజరానా ప్రకటించారు. రూ.2.5 కోట్ల నగదు, కడపలో 1000 చదరపు అడుగుల స్థలం, రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్-1 అధికారిగా ఉద్యోగం కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనంద క్షణాలను ముఖ్యమంత్రితో పాటు ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌తో పంచుకున్నారు. విజేతగా నిలవడం ద్వారా భారతదేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారంటూ ఆమెను చంద్రబాబు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించారు. క్రీడాకారిణి శ్రీచరణి ఈ సందర్భంగా మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన



టీషర్ట్‌ను అందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలిరాజ్ ఉన్నారు. అంతకముందు ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయానికి

- మిగతా 2లో..



## ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యాలయాల్లో ఎప్పుడూ వందేమాతరం పాడలేదు : ఖర్గే

**న్యూఢిల్లీ, సూర్యవాస్తవం:** స్వాతంత్ర్యోద్యమ సమయంలో భారతీయులకి స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఢిల్లీలో ఈ గేయ స్మారకోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొని గొప్పగా చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బిజెపి, ఆర్ఎస్ఎస్‌లపై విరుచుకుపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ఈ పాట ప్రసిద్ధ నినాదం. అయినప్పటికీ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు తమ కార్యాలయాల్లోగానీ, శాఖల్లోగానీ పాడలేదు. సొంత గ్రంథాల్లోగానీ, సాహిత్యంలోనూ ఈ పాటను పొందుపరచలేదు అలాంటిది ఇప్పుడు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ఈ గేయ 150 స్మారకోత్సవాలు జరుపుతున్నాయని ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆర్ఎస్ఎస్ జాతీయ గీతం కంటే 'నమస్తే సదా వతసలే పాడటానికే ఇష్టపడిందని ఆయన తన ప్రకటనలో ఎత్తిచూపారు. కాంగ్రెస్ పార్టీ 1986 నుండి నేటి వరకు ప్రతి సమావేశం, ప్లీనరీ అయినా, బ్లాక్‌స్థాయి సమావేశం అయినా నేతలు వందేమాతరం పాటను ఆలపిస్తారు. నేడు జాతీయవాద

- మిగతా 2లో..

## 16 నెలల్లో మనం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

❖ కళ్యాణదుర్గం యువనేత లోకేష్

❖ పనిచేసిన కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులిస్తున్నాం

❖ వైసిపి ఫేక్ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టండి

❖ శవరాజకీయాలకు వైకాపాకు వెన్నతో పెట్టిన విద్య

❖ కూటమి కార్యకర్తలతో కలిసికట్టుగా ముందుకు సాగండి



**అనంతపురం, సూర్యవాస్తవం :** గత 16నెలల పాలనలో మనం చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోవాలి, ప్రజలతో మమేకం కావాలి.... ఇకపై యావత్ పార్టీ కేడర్ క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలను కలవాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కేడర్ కు పిలుపు నిచ్చారు. కళ్యాణదుర్గం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాం. దేశంలో ఎక్కడాలేని విధంగా 4వేల పెన్షన్, చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు పథకాలను అమలు చేస్తున్నాం. ఒక్క పెన్షన్లపైనే 40వేలకోట్ల ఖర్చుపెడుతున్నాం. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒక కార్యక్రమం ఇస్తాం. వీటన్నింటినీ సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రతిపక్షంలో ఉన్నపుడు అనేక కేసులు పెట్టించుకుని ఇబ్బందిపడ్డారు, దెబ్బలు తిన్నారు, పనిచేసేవాళ్లను గుర్తించేందుకే ఉత్తమ కార్యకర్తలతో భేటీ అవుతున్నాం.

- మిగతా 2లో..

## త్వరలో 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం'

- గ్రామీణ రోడ్ల స్థితి తెలుసుకునే అవకాశం - సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**అమరావతి, సూర్యవాస్తవం :** గ్రామీణ రోడ్ల పూర్తి సమాచారాన్ని 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం'తో ప్రతి ఒక్కరూ తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సాస్కి నిధుల సాయంతో పల్లెపండుగ 2.0ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ పథకాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నిధులు అందుబాటులో ఉన్నా పనుల్లో ఆశించి స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అడవితల్లి బాట, జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ



రహదారులన్నింటినీ జియో రూరల్ మేనేజ్మెంట్ సిస్టంకు అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, రహదారులను మెరుగుపరచుకునేలా ఈ సాంకేతికత ఉండాలన్నారు. రెండు రోజుల్లో ఇందుకు సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్

- మిగతా 2లో..

## 150 సంవత్సరాల స్ఫూర్తికి వందనం : వైఎస్.జగన్

**గుంటూరు సూర్యవాస్తవం :** భారతీయ జాతి గౌరవానికి ప్రతీకగా నిలిచిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ తన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'వందేమాతరం' 150 సంవత్సరాల స్ఫూర్తికి నా వందనం. బంకిం చంద్ర ఛటర్జీ గారు రచించిన ఈ పవిత్ర గీతం మన స్వాతంత్ర్య సమరయోధులలో రగిలించిన ఐక్యతా భావనే మనందరికీ ఆదర్శం. ఆ స్ఫూర్తితో మన భావితరాల కోసం, వారి అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం' అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.



## రాజ్యాంగంపై
# బీజేపీ, ఈసీ దాడి

(మొదటిపేజీ తరువాయి)

బిజెపి ఆత్మరక్షణలో పడిందే తప్ప వ్యతిరేకించట్లేదని చెప్పారు. ఓట్ల దొంగతనం వెలికితీసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తమ వద్ద చాలా సమాచారం ఉందని, తాము ఈ ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు.

ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు బిజెపి యత్నం

బీహార్‌లోని బంకాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఢిల్లీలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న బిజెపి నాయకులు బీహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో కూడా ఓటు వేశారని విమర్శించారు. 'హర్యానాలోని రెండు కోట్ల మంది ఓటర్లలో 29 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, హర్యానాల్లో బిజెపి 'ఓటు చోరీ'లో మునిగిపోయింది. ఇప్పుడు వారు బీహార్‌లోనూ దానిని పునరావృతం చేయడానికి ప్రయత్నిస్తున్నారు' అని అన్నారు.'ప్రధాన సమస్యల నుండి దృష్టి మళ్లించడానికి' సోషల్ మీడియా రీల్స్ చేయడానికి యువతను ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. 'రీల్స్ 21వ శతాబ్దపు వ్యసనం' అని ఆయన అన్నారు.

**మీడియాను నియంత్రిస్తోన్న బిజెపి**

భాగల్పూర్‌లో మరో ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. బీహార్‌లోని రైతులు, కార్మికులు, నేత కార్మికులకు బ్యాంకుల నుండి రుణాలు అందడం లేదని, వారి రుణం మాఫీ కావడం లేదని విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ కొన్ని కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రిని 24 గంటలు చూపించడానికి టివి ఛానెళ్లకు బిజెపి డబ్బు చెల్లిస్తుందని, మీడియాను నియంత్రిస్తోందని చెప్పారు. 'హర్యానాలో చోరీకి సర్కార్' (దొంగతనంతో ఏర్పడిన ప్రభుత్వం) అని నేను పూర్తి నమ్మకంతో చెప్పగలను. ఇది ఆపరేషన్ సర్కార్ చోరీ. ఒక బ్రెజిల్ మోడల్ ఫొటోతో 22 నకిలీ ఓట్లు సృష్టించినా ఎన్నికల సంఘం ఎందుకు కనిపెట్టలేకపోయింది? ఒకే ఇంట్లో 501 మంది ఓటర్లు ఉన్నట్లు చూపినా గుర్తించలేకపోయింది? బీహార్‌లోనూ ఇలా ఓట్ల చోరీ జరిగే ప్రమాదం లేకపోలేదు' అని ఆయన పేర్కొన్నారు.

# త్వరలో 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం'

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధం కావాలని సూచించారు. అడవితల్లి బాటను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని ఈ విధానానికి అనుసంధానించాలన్నారు. తద్వారా ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాల్లో పనుల పురోగతిని పరిశీలించే అవకాశం కలుగుతుందన్నారు. అడవితల్లి బాల పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదన్నారు. ఇందుకు నిధులు రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సకల్పంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. పల్లె పండుగ 2.0 కోసం సాస్కి నిధులు వినియోగించుకోవడంలో ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. రూ.2,123 కోట్ల నిధులతో పల్లెల్లో 4,007 కిలోమీటర్ల మేర రహదారులు, గోకులాలు, మ్యాజికల్ డ్రైన్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు డిప్యూటీ సిఎంకు వివరించారు. ముఖ్య కార్యదర్శి, కమీషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. ప్రస్తుతం చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయగోదావరి జిల్లాల్లో నిర్మాణంలో జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలని, నీటి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదే అందరి ప్రథమ బాధ్యత కావాలన్నారు. 17వ తేదీ అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి జల్ జీవన్ మిషన్ పనుల్లో పురోగతి, ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న నీటి సరఫరా వ్యవస్థల వద్ద నీటి నాణ్యతను స్వయంగా పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. మార్చి నాటికి కోటి మందికి స్వమిత్వ యాజమాన్య హక్కు పత్రాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం మొదటి విడతలో 613 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 5.18 లక్షల మందికి యాజమాన్య పత్రాలు అందించేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. రెండవ విడతలో 5,847 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి నెలాఖరు మరో 45.66 లక్షల మందికి యాజమాన్య హక్కు పత్రాలు సిద్ధం చేస్తామన్నారు. డిసెంబరు నాటికి మిగిలిన గ్రామాల్లోను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పిఆర్ అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, సర్వే విభాగం కార్యదర్శి కూర్మనాథ్, పిఆర్ ఇఎన్‌షి బాలూ నాయక్ తదితరులు పాల్గన్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కార్యాలయాల్లో ఎప్పుడూ వందేమాతరం పాడలేదు : ఖర్గే

(మొదటిపేజీ తరువాయి)

సంరక్షకులమని చెప్పుకునే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు తమ శాఖల్లోగానీ లేదా కార్యాలయాల్లో గానీ వందేమాతరం లేదా మన జాతీయ గీతం జనగణమనను ఎప్పుడూ పాడకపోవడం విడ్డూరం. వాటికి బదులుగా వారు దేశాన్ని కాదు.. వారి సంస్థల్ని కీర్తిస్తూ నమస్తే సదా వత్సల అనే పాటను పాడుతున్నారు. 1925లో స్థాపించినప్పటి నుండి ఆర్‌ఎస్‌ఎస్ సార్వత్రిక గౌరవం ఉన్నప్పటికీ వందేమాతరాన్ని నిరాకరించింది. ఈ పాటను ఆర్‌ఎస్‌ఎస్ స్వీకరించలేదు. ఆర్‌ఎస్‌ఎస్ గ్రంథాలలో లేదా సాహిత్యంలో ఒక్కసారి కూడా పాట ప్రస్తావన కనిపించదు అని ఖర్గే శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

## 16 నెలల్లో మనం చేసిన మంచిని
# ప్రజల్లోకి తీసుకెళ్లండి

(మొదటిపేజీ తరువాయి)

**పార్టీని నిర్లక్ష్యం చేయవద్దు...**

పార్టీ సభ్యత్వం, మన టిడిపి, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాల్లో ప్రతిభ చూపినవారిని గుర్తించే వేదిక ఇది. ఇది ఇక్కడితో ఆగదు, మరింత ముం దుకు తీసుకెళ్తాం, ఇప్పుడు మన టిడిపి వచ్చింది. పనిచేసిన వారిని జల్లెడబట్టి నామినేటెడ్ పదవులు ఇస్తున్నాం. పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో కేడర్ భాగస్వాములు కావాలి, ప్రజలకు దగ్గర కావాలి. మన పార్టీలో చేసింది చెప్పుకోలేని జబ్బు ఉంది. మనం అధికారం లోకి వచ్చాక చేసింది చెప్పుకోం. నాతో సహా ప్రజలకోసం ఏదో చేద్దామని తప్ప చేసింది చెప్పుకోం. జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కియా మోటార్స్ తెచ్చినప్పటికీ ప్రజలకు చెప్పుకోలేకపోవడం వల్లే 2019లో ఓడిపోయాం. అధికారంలో ఉన్నపుడు సహజంగానే వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఎక్కడకు వెళ్లినా చివరికి తిరిగిరావాల్సింది పార్టీవద్దకే. పార్టీ శాశ్వతం అన్న విషయాన్ని కార్యకర్తలు మరువద్దు. ఎట్టి పరిస్థితుల్లో పార్టీని నిర్లక్ష్యం చేయొద్దు.

**చేసింది చెప్పకపోవడమే బలహీనత...**

రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఆ నియోజకవర్గంలో కేడర్ ను కలిశాకే అధికారిక కార్యక్రమానికి వెళు _న్నా. చంద్రబాబు కూడా ఎంత పని వత్తిడి ఉన్నా కార్యకర్తలతో మాట్లాడాకే తిరిగివెళ్తున్నారు. కార్యకర్తలంతా ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. దేవుడు కూడా అందరి సమస్యలు, కోర్కెలు, తీర్చలేరు. అంతమాత్రాన అలక వహించవద్దు. మనది పెద్ద ఉమ్మడి కుటుంబం. మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి. పార్టీలో అంతర్గతంగా నేను జగన్ పైకంటే ఎక్కువగా మీ కోసం పోరాడతాను. పార్టీలో సంస్కరణలు తెచ్చేందుకు పోరాడాను. కొంతమంది పనిజరగకపోతే సోషల్ మీడియా ఎక్కుతున్నారు, అది మంచి పద్ధతి కాదు. మనం పోరాడాల్సింది మన రాజకీయ ప్రత్యర్థి వైసిపితో మాత్రమే. మనలో ఉన్న బలహీనత చేసిన మంచిని సరిగా చెప్పలేం. వైసిపి వాళ్లు చేయనిది కూడా బలంగా చెబుతారు.

**వైసిపి శవరాజకీయాలు..**

వైసిపి వారికి శవరాజకీయాలు వెన్నతోపెట్టిన విద్య. శ్రీకాకుళం గుడి ఘటనలో 9మంది చనిపోయారు. స్వామిని ప్రజలవద్దకు తీసుకెళ్తామని 94సంవత్సరాల పాండా 20కోట్లు పెట్టి గుడికట్టారు. ఘటన జరిగిన వెంటనే నేను, కేంద్రమంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్న, అనితమ్మ హుటాహుటిన అక్కడకు వెళ్లాం. వైసిపి వాళ్లు అది కూడా పాండా వ్యాఖ్యలను ఎడిట్ చేసి పర్మిషన్ కు అప్లయ్ చేస్తే ఇవ్వలేదని ఫేక్ చేశారు, మన తెలుగుబిడ్డ, క్రికెటర్ శ్రీచరణిని 3నెలల క్రితం విశాఖలో కలిశాను. బాగా



ఆడాలని ప్రోత్సహించాను. వరల్డ్ కప్ లో విజయం సాధించాక చెల్లెమ్మకి మంచి రివార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఈలోగానే వైకాపా వారు అక్కడ కూడా కులం ప్రస్తావన తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈరోజు ఉండవల్లిలో శ్రీచరణి నన్ను కలిసినపుడు 24గంటలు ఎలా కష్టపడుతున్నారని అడిగింది. రాజకీయాల్లో మార్పు తేవాలంటే కష్టపడి పనిచేయక తప్పదు. గతంలో 32మంది కమ్మ డిఎస్పీలకు ప్రమోషన్ ఇచ్చామని తప్పుడు ప్రచారం చేశారు. చివరకు నలుగురు మాత్రమే ఉన్నారని తేలింది. బాబుగారిని ఆదర్శంగా తీసుకొని అలసట వీడి ముందడుగు వేయండి. ప్రతిపక్షంలో ఉన్నా, అధకారంలో ఉన్నా ఆయన రేయింబవళ్లు కష్టపడతారు. ఇటీవల నేను ప్రధానిని చూసి ఆశ్చర్యపోయా. 75ఏళ్ల వయసులో కూడా ఎంతో కష్టపడుతున్నారు. అందుకే వారిలో వయోభారం కనపడదు.

**గతంలో పడిన కష్టాలను మరువద్దు....**

పార్టీలో సమస్యలుంటే పరిష్కరించడానికి ఎంపి, ఎమ్మెల్యే, ఇన్ ఛార్జి మంత్రి, నేను ఉన్నా. నేను కూడా ఇకపై వారానికి ఒకరోజు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటా. పార్టీ పిలుపు ఇచ్చే అన్ని కార్యక్రమాలు చిత్తశుద్ధితో అమలుచేస్తూ, చేసింది సమర్థవంతంగా జనంలోకి తీసుకెళ్తే 2029 ఎన్నికల్లో కూడా జయం మనదే. అధికార గర్వం, అహంకారం వీడి టీమ్ వర్క్ గా పనిచేయాలి. మంత్రులందరం రాష్ట్రానికి మేలు చేయాలనే తపనతో పనిచేస్తున్నాం. అధికారంలోకి వచ్చాం కదా అని గతంలో మనం పడిన కష్టాలను మరువద్దు. నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఎటెంప్టివ్ మర్డర్ కేసుపెట్టారు. చంద్రబాబు ని 53రోజులు బంధించారు. ఉత్తమ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం. నామినేటెడ్ లో ఇప్పుడు మొదటిరౌండ్ మాత్రమే పూర్తయింది. మరో రౌండ్ ఉంది, కంగారు వద్దు. పనిచేస్తూ వెళ్తే పార్టీ మిమ్మల్ని కచ్చితంగా గుర్తిస్తుంది. నేను మర్చిపోయినా చంద్రబాబు మిమ్మల్ని మర్చిపోరు.

**కూటమి కార్యకర్తలతో కలసివెళ్లండి...**

చిన్నచిన్న విభేదాలున్నా కూటమి పార్టీల కార్యకర్తలతో కలసికట్టుగా ముందుకెళ్లాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంలో ప్రధానమంత్రిగారిని నాయకత్వాన్ని భేషరతుగా బలపరుస్తున్నాం. భవిష్యత్తులో కూడా మూడు పార్టీలు కలిసే ఉంటాయి. వైసిపి ఫేక్ ప్రచారాన్ని పట్టించుకోవద్దు. అధికారం పోయాక వారు అసెంబ్లీనుంచి పారిపోయారు. బాబుగారు సింహంలా సింగిల్ గా నిలబడి పోరాడారు. నాయకుడంటే అలా ఉండాలి. వైసిపిఫేక్ బ్యాచ్ ని ఎవరూ నమ్మరు. ఎర్రబుక్కును ఎగతాళి చేసినవారి పరిస్థితి ఏమిటో మీరంతా చూస్తున్నారు. పార్టీ కేడర్ ను ఇబ్బందులు పెట్టిన వారెవరినీ వదిలే ప్రసక్తిలేదు. కార్యకర్తలంతా రేయింబవళ్లు కష్టపడాలి. కలసికట్టుగా పనిచేద్దాం, పోరాడదాం. నేను, బాబు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో తిరుగుతాం. ఓర్పు సహనంతో ముందుకెళదాం.

మీ ఎమ్మెల్యే ప్రజలకు ఏదో చేయాలనే తపనతో ఉన్నారు. ఆయనకు ఇవ్వడం తప్ప చేయి చాపే అలవాటులేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు గంభీరంగా ఉన్నాయి. 12లక్షల కోట్ల అప్పు ఉంది. ముఖ్యమంత్రి సమర్థతవల్లే నెగ్గుకురాగలుతున్నాం. ఎన్ని కష్టాలు ఎదురైనా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం, వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని యువనేత లోకేష్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్ ఛార్జి మంత్రి టిజి భరత్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం పార్లమెంటు ఇన్చార్జి వెంకటశివుడు, జోనల్ కోఆర్డినేటర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) పాల్గొన్నారు.

# శ్రీచరణికి రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్న ఆమెకు నారా లోకేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. తొలుత గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే ఆమెకు రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

**సమస్యలు ఎదుర్కొని నిలిచాం.. కప్పు గెలిచాం..**




ప్రపంచ కప్ ఫైనల్ ఆడాలనే సంకల్పంతో జట్టు మొత్తం ప్రయత్నించిందని, చాలా సమస్యలు ఎదుర్కొని నిలిచామని, కప్పు సాధించామని భారత మహిళా క్రీడాకారిణి శ్రీచరణి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరులోని ఎసిఎ క్రికెట్ స్టేడియంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆడపిల్లల క్రికెట్ పట్ల ఇప్పుడు తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు వచ్చిందని, చాలా మంది తనకు ఫోన్ చేసి తమ అమ్మాయిలు క్రికెట్ కెరీర్‌ను ఎలా మొదలు పెట్టాలో అడుగుతున్నారని చెప్పారు. ఇండియా ఉమెన్స్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ కష్టం, వారి అనుభవం తమకెంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. తమకు మద్దతు తెలిపిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన క్రికెట్ జీవితంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఎసిఎలో శిక్షణ తీసుకున్న తాను ప్రొఫెషనల్ క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన ఐదేళ్ల తర్వాత భారత జట్టులో స్థానం దక్కిందని తెలిపారు. అనంతరం కడపకు చేరుకున్న శ్రీచరణిని ఘనంగా సన్మానించారు.

**త్వరలోనే మహిళా క్రికెట్ అకాడమీ : శివనాథ్**

ఎసిఎ ప్రెసిడెంట్ శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే మహిళా క్రికెటర్లకు శ్రీచరణి ఆదర్శమన్నారు. ఎసిఎ తరపున త్వరలో మహిళా క్రికెట్ అకాడమీ ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ఎసిఎ తరపున మహిళా క్రీడాకారులను ప్రోత్సహించేలా వైజాగ్‌లో మిథాలీ రాజ్ పేరుతో ఒక స్టాండ్ ప్రారంభించామని చెప్పారు.

Truth of News
# సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in



# రాయలసీమలో రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు

**తిరుపతి, సూర్య వాస్తవం, నవంబర్ 7:** ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు రానున్నాయి. రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ సిద్ధమైంది. పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనుంది. త్వరలో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం, కంపెనీమధ్య అవగాహన ఒప్పంద కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 77వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడిరానుంది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో.. రూ.22,000కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎస్ఏ ఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలి పింది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 7000 మందికి, పరోక్షంగా 70వేల మందికి ఉపాధి అవకా శాలు లభించే అవకాశం ఉందని అంచనా. కాగా, విశాఖపట్నంలో నవంబర్ 14,15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం. రాయలసీమ లోని కడప, కర్నూలు జిల్లాల్లో.. 1,750 మెగావాట్ల సోలార్/ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా టెండర్లలో భాగంగా ఎస్ఏఈఎల్ ఈ ప్రాజెక్టులు చేపడుతోంది. పరిశ్రమలు, డేటా సెంటర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం లక్ష్యంగా వీటిని నిర్మిస్తున్నారు. అంతేకాకుండా 200 మెగావాట్ల బయోమాస్ ప్రాజెక్టును చేపడుతున్నారు. అందులో భాగంగా 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పలు బయోమాస్ ప్లాంట్లను నిర్మిస్తారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంతే కాకుండా, రూ. 3000 కోట్లతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ అవకాశాలు వినియోగించుకో వచ్చు. మారిటైం రంగంలో లాజిస్టిక్స్‌ను, ఎగుమతులను బలోపేతం చేసేందుకు రూ.4000 కోట్ల పెట్టుబడితో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలను అభి ,వృద్ధి చేయనున్నారు. కాగా, తమ కంపెనీ ఇప్పటికే ఏపీలో రూ.3,200 కోట్లు పెట్టుబడులు చేసినట్లు ఎస్ఏఈఎల్ తెలిపింది. 9 నెలల్లో 600 మెగావాట్ల సామర్థ్యాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపింది.కాగా, రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్వర్క్ ఏర్పాటు, గ్రీన్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల హిందూజా గ్రూప్ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే.తర్వాత శుద్ధ ఇంధనం (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఏపీకి భారీ పెట్టుబడులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో బ్రూక్ ఫీల్డ్ చేపట్టనున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఖీఇఅ) రూ.7,500 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ.9,910 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అందులో భాగంగా 640 మెగావాట్ల పవన విద్యుత్, 400 మెగావాట్ల సౌర శక్తితో.. మొత్తంగా 1040 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, ఇప్పటివరకు ఒక ప్రైవేట్ ప్రాజెక్టుకు ఆర్ఈసీ.. ఇంత భారీ మొత్తంలో నిధులు ఇవ్వడం ఇదే మొదటిసారి అని అధికార వర్గాలు వెల్లడించాయి.

## తమిళ సినిమాల్లోకి రోజా



**చెన్నై, సూర్య వాస్తవం, నవంబర్ 7:** మాజీ మంత్రి రోజా 12 ఏళ్ల తర్వాత సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నారు. తమిళ సినిమా 'లెనిన్ పాండియన్'లో 'సంతానం' పాత్రలో నటిస్తున్నారు.. రోజాకు ప్రభుదేవా, ఖుష్బూ శుభాకాంక్షలు తెలిపారు. 'లెనిన్ పాండియన్' ఒక ఫ్యామిలీ డ్రామా-ఎమోషనల్ స్టోరీగా రూపొందుతోంది. డైరెక్టర్ బాలచంద్రన్ తమిళ సినిమాల్లో 'విజయ్ సేతుపతి', 'అజిత్' చిత్రాలకు సహాయక డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు రోజా పాత్ర 'సంతానం' ఒకబలమైన మహిళా క్యారెక్టర్, కుటుంబ సంక్షోభాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్లుగా వీడియో బట్టి అర్థం చేసుకోవచ్చు. నగరి నుంచి రెండు సార్లు గెలిచిన రోజా.. కొంత కాలం మంత్రిగా చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆమె తన పాత రంగంపై దృష్టి పెట్టారు. మెల్లగా టీవీషోలు.. సినిమాల వైపు వెళ్తున్నారు. 'జీ తెలుగు సూపర్ సీరియల్ చాంపియన్‌షిప్ సీజన్4' అనే రియాలిటీ షోలో జడ్జ్‌గా వ్యవహరించారు. తమిళంలోనూ కొన్ని టీవీ షోలు చేశారు. రోజా 90లో సూపర్‌గ్లామర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నారు. తమిళంలోనూ ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఆమె భర్త సెల్వమణి కూడా ప్రముఖ దర్శకుడే. ఏపీలో కన్నాతమిళంలో అయితే మంచిదని అక్కడే రీఎంట్రీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా పేరు తె?చ్చుకున్న రోజా ఇటీవలికాలంలో పెద్దగా స్పందించడం లేదు. ఆమె సైలెంట్ అయ్యారన్న ప్రచారం జరుగుతోంది. అయితే అడపాదడపా ఆమె నగరిలో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించింది.

## జిల్లాస్థాయి రిటైల్ మార్కెటింగ్ ప్రాజెక్ట్ ప్రదర్శన




**గాండ్లపెంట, సూర్య వాస్తవం, నవంబర్ 7:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయిలో జరిగిన రిటైల్ మార్కెటింగ్ ప్రాజెక్ట్ ప్రదర్శన లో బహుమతి పొందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాండ్లపెంట విద్యార్థులు శ్రీసత్యసాయి జిల్లా స్థాయిలో స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ప్రదర్శన లో భాగంగా నిర్వహించిన పోటీలలో రిటైల్ మార్కెటింగ్ కి బహుమతి రావడం జరిగిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాండ్లపెంట ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ఈ ప్రదర్శన లో పాల్గొన్న విద్యార్థులను రిటైల్ ఇన్స్ట్రక్టర్ రజిత, సైన్స్ టీచర్ రాజారత్నం విద్యార్థులు నిహారిక, ముస్కాన్, నక్షత్ర దీప ,రెడ్డికుమార్ ను అభినందించడం జరిగింది.

## వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



**కుప్పం, సూర్య వాస్తవం, నవంబర్ 7:** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుప్పం ప్రాంతంలో చలి అధికంగా ఉంటోంది. వల్ల ఎంతోమంది నిరాశ్రయులు చలికి తట్టుకోలేక అనేక ఇబ్బందులు పడుతూ, దాతల కోసం ఎదురుచూస్తున్నరు. అటువంటి తరుణంలో ఈ విషయాన్ని గమనించిన కుప్పం సమాచారం సొసైటీ సభ్యులు శుక్రవారం దాదాపు 55 మంది నిరాశ్రయులకు దుప్పట్లను పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్ దగ్గర, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న నిరుపేదలు, యాచకులకు దగ్గరుండి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ కుప్పంలో చలి తీవ్రత ఎక్కువగా ఉందని చాలా నిరుపేదలు, యాచకులు దుప్పట్లు లేక రోడ్డు పక్కన చలిలోనే నిద్రిస్తున్నారని వారికి సొసైటీ తరపున ఈ కార్యక్రమం ద్వారా దుప్పట్లు అందించామని చెప్పారు. గతనెల చలికోట్లు పంపిణీ చేశామన్నారు. ఈవారం దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో మరి కొంతమందికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా శీతాకాలంలో వృద్ధులకు దుప్పట్లు, చలి దుస్తులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. పేదలకు సేవ చేయడమే ధ్యేయంగా తమ సొసైటీ పనిచేస్తుందన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడ్తామని తెలిపారు. సమాజ సేవలో ప్రధానమైనది మానవ సేవని సాటి మనిషికి సేవ చేయడంలో ఉన్న ఆనందం ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, మతీన్, గని, ఫైరోజ్, సురేష్, కృష్ణ, సోము, ఖలీమ్, చంద్ర, రాజువేల్, గురుస్వామి, ఇస్మాయిల్, పటేల్ బాబు, సంతోష్, నూరు, కృష్ణ చారి, అల్తాఫ్, మిస్టర్ ఆర్కె మొబైల్ రఫీక్, వినోద్, లాలు, అజీమ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంతో సమీక్ష : కమిషనర్



**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 7:** నగరపాలక సంస్థ కమిషనర్ వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవన యజమానులు నిర్దేశించిన ప్లాను ప్రకారం కట్టుబడులు జరిగేలా సిబ్బంది అందరూ చర్యలు తీసుకోవాలని, అలాగే భవన నిర్మాణం జరుగు సందర్భంలో పిల్లర్ల దశలోనే గుర్తించి తదుపరి చర్యలు తీసుకొన వలసిందిగా ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ ప్లానింగ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ నగరపాలక సంస్థకు ఆదాయ వనరులు పెరిగేలా, అలాగే అనుమతుల ప్రకారం నిర్మాణం జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఉదయం జరిగిన ఓపెన్ ఫోరం కార్యక్రమంలో 19 సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించి పరిష్కారాలను అందజేశారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం పై ప్రజలు హర్ష వ్యక్తం చేశారు. ఓపెన్ ఫోరం కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, డిప్యూటీ సిటీ ప్లానర్ రఘునాథ రావు, ఏసీపీలు, టీపీబివోలు, వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 12న నాయుడుపేట ఏఎంసీ పాలక మండలి ప్రమాణ స్వీకరణ

- ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్



**నాయుడుపేట, సూర్య వాస్తవం, నవంబర్ 7:** నాయుడుపేట ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఈ నెల 12వ తేదీ జరగనున్నట్లు ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 9 వ తేదీ నాయుడుపేట ఏఎంసి పాలకమండలి ప్రమాణ స్వీకారం జరగవలసి ఉండగా ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు. ఈనెల 8,9వ తేదీల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుపతి,చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ ప్రకటనలో తెలియజేశారు. ఈ నేపథ్యంలో నాయుడుపేట ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం మహోత్సవం ఈ నెల 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు.

# సంపాదకీయం

## పీఓకే దిశగా అడుగులు పడుతున్నాయా..

దేశ విభజన సమయంలో అప్పటి కశ్మీర్ రాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు పలు ప్రయత్నాల తర్వాత అంగీకరించారు. ఆ ప్రక్రియ సాంకేతికంగా పూర్తియింది. కాని వాస్తవ స్థితిని చూసినపుడు, కశ్మీర్‌లో కొంత భాగం పాకిస్థాన్ ఆక్రమణకు గురై ఇప్పటికీ వారి అధీనంలోనే ఉంది. ఈ భాగం, ఆ భాగం అని గాక మొత్తం కశ్మీర్ ప్రశ్నపై రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధాలలో ఏమీ తేలలేదు. భారత సైన్యం తూర్పు పాకిస్థాన్‌ను విడదీసి అక్కడి పాకిస్థాన్ సైన్యాన్ని పెద్ద సంఖ్యలో బందీగా పట్టుకున్నపుడు, పిఒకెను మనకు వదలుకున్నట్లయితేనే ఆ బందీలను వదలగలమనే షరతు విధించవలసిందనే అభిప్రాయం ఒకటుంది. ఎందుకైతేనేమి అది జరగలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం, కశ్మీర్ సరిహద్దు వివాద పరిష్కారంపై చర్చలు జరిగాయి గాని, పిఒకెను సైనికంగా స్వాధీన పరచుకోవడమనే అంశం అజెండా పైకి రాలేదు.నరేంద్ర మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి పిఒకె స్వాధీనం ప్రస్తావనలు వస్తున్నాయి. ఎప్పటికైనా ఆ పని చేస్తామంటున్నారు. ఆయన నాయకత్వాన గత ప్రధాని వాజపేయికి మించి తీవ్ర జాతీయవాద వైఖరిని అవలంబిస్తున్నందున అటువంటి ప్రస్తావనలు సహజమనాలి. ఆ ధోరణికి అనుగుణంగానే ఆయన ప్రభుత్వం, కశ్మీర్ వివాదమంటూ అసలు ఏమీ లేదని, దానిపై పాకిస్థాన్‌తో చర్చించవలసింది కూడా ఏమీ లేదని, చర్చించటమంటూ ఉంటే వారు పిఒకెను మనకు వశపరచటం గురించి మాత్రమేనని అంటూ వస్తున్నది. అందుకు పొడిగింపుగా మాట్లాడుతూ, మనమే ఒక రోజు ఆ భూభాగాన్ని స్వాధీనపరచుకోగలమని చెప్తున్నది. దీనంతటిలోని సాంకేతికతలను అట్లుంచితే, ఆచరణకు సంబంధించిన ప్రశ్నలు కొన్నింటిని గమనించవలసి ఉంటుంది. ఆ విధమైన ఆక్రమణ సాధ్యమా అన్నది ఒక ప్రశ్న కాగా, ఒకవేళ ఆక్రమించినా దానిని అధీనంలో ఉంచుకుని నియంత్రించగలరా అన్నది మరొక ప్రశ్న. యుద్ధాలు, ఆక్రమణలు, నియంత్రణలు అనే మూడు కూడా ఆషామాషీ విషయాలు కావు. అందువల్ల ఆవేశంతోగాక జాగ్రత్తగా ఆలోచించవలసి ఉంటుంది. మొదట యుద్ధం మాట చూస్తే, పాకిస్థాన్ కన్న ఇండియా చాలా శక్తివంతమైనదని వేరే చెప్పనక్కరలేదు. కాని ఇరువురికి అణ్వస్త్రాలు ఉండటం విస్మరించలేనిది. పాకిస్థాన్ 'న్యూక్లియర్ విధానం' ప్రకారం, తమ భూభాగానికి, భౌగోళిక సమగ్రతకు ముప్పు ఏర్పడినట్లయితే అణ్వస్త్రాలు ఉపయోగిస్తారు. ఆ పని నిజంగా జరుగుతుందా అనేది వేరే విషయం. కాని, జరగదని కూడా ఎవరూ హామీ ఇవ్వలేరు. ఒకసారి తూర్పు పాకిస్థాన్‌ను కోల్పోయిన తర్వాత, మరొక భూభాగాన్ని పోగొట్టుకునేందుకు సిద్ధపడటం తేలిక కాదు. అందువల్ల, పిఒకెను స్వాధీనపరచుకునే లక్షంతోనే యుద్ధమన్నది తేలిక కాదు. ఆ స్థాయి యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా జోక్యమన్నది సరేసరి. పిఒకె స్వాధీనం జరుగుతుందని వాదన కోసం ఒప్పుకుంటే, అపుడు నియంత్రణ ప్రశ్న ముందుకు వస్తుంది. స్వాధీనం తక్షణం జరిగేది కాగా, నియంత్రణ దీర్ఘకాలికం. అందులోని సాధకబాధకాలేమిటి? కశ్మీర్ లోయ భూభాగం 15 వేల చదరపు కిలోమీటర్లకు పైగా ఉంది. పిఒకె వైశాల్యం అంతకు రెట్టింపు కన్న ఎక్కువ. జనాభా ఇక్కడ సుమారు కోటీ 80 లక్షల కాగా, అక్కడ దాదాపు 55 లక్షలు. వీరంతా ముస్లింలే. ఇటు వైపు భూభాగం ఏ విధంగానైతే కొండలు, లోయలు, నదులతో సంక్లిష్టమైనదో, అటువైపుది బహుశా అంతకన్న సంక్లిష్టమైనది. ఇటువైపు గలవారికి మన పట్ల ప్రేమ, విధేయత అన్నవి లేవనుకుంటే, వారికీ లేవు. వీరు నిరసనలకు, తీవ్రవాద చర్యలకు పాల్పడుతున్నారనుకుంటే, అటువైపు వారు అందుకు తోడవుతారు. అటువైపు వారికి పాకిస్థాన్ పట్ల కొంత నిరసన ఉండవచ్చు. దాని అర్థం ఇండియాను ప్రేమిస్తున్నారని కాదు. వీరూవారు కలిస్తే కశ్మీరీ జాతి మొత్తంగా స్వతంత్ర భావనలు బలపడి, రెండు దేశాలతో సంబంధం లేని విధంగా స్వతంత్ర కశ్మీర్ ఆలోచనలు తలెత్తగల అవకాశం ఎంతైనా ఉంటుంది. రెండు కశ్మీర్‌లను ఆనుకుని ఉత్తరాన, పడమరన అఫ్ఘానిస్థాన్‌తోపాటు మధ్య ఆసియా ముస్లిం దేశాలు విస్తరించి ఉన్నాయి. వాటన్నింటా ఇస్లామిస్ట్ తీవ్రవాద సంస్థలున్నాయి. లోగడ ఒక దశలో ఆ సంస్థలు కొన్ని కశ్మీర్‌ను ఇండియా నుంచి విముక్తం చేయగలమని ప్రకటించి అక్కడి సంస్థలకు ఆయుధాలు, నిధులు, శిక్షణలు కూడా ఇచ్చాయి. మధ్య ఆసియాలోని ఇస్లామిస్ట్ తీవ్రవాదం కొన్ని దశాబ్దాలుగా అంతులేకుండా పెచ్చరిల్లుతూనే ఉంది. సమయానుసారంగా ఆ ధోరణులకు ఆ ప్రాంతపు దేశాలలోపాటు, తమ వ్యూహాత్మక క్రీడల కోసం అగ్రరాజ్యాలూ ప్రోత్సాహం ఇస్తూనే ఉన్నాయి ఇప్పటికే కశ్మీర్‌లో మన బలగాలు కొన్ని లక్షలు మోహరించి ఉన్నట్లు అంచనా. పిఒకె స్వాధీనం తర్వాత మరెన్ని మోహరింపులు అవసరం కావచ్చు? ఎంతకాలం? అట్లయినా పిఒకె శాశ్వతంగా భారతదేశంలో ఉండిపోగలదనే హామీ ఉంటుందా? కశ్మీర్ విషయమై నెహ్రూ తప్పు చేసారనేది. ఈ మాటను ప్రధాని మోడీ అక్టోబర్ 31న సర్దార్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఆయన 'ఐక్యతా విగ్రహం' వద్ద ప్రసంగిస్తూ మరో మారు అన్నారు. కశ్మీర్ సంస్థానం మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలన్నది పటేల్ ఆకాంక్ష కాగా, అందుకు నెహ్రూ అడ్డుపడ్డారని ఆరోపించారు మోడీ. దేశ ప్రజలపై గాంధీజీ, నెహ్రూల ప్రభావం ఇప్పటికీ తగినంత ఉన్నందున, దానిని దెబ్బ తీస్తూపోతే ఆ మేరకు తమ ప్రభావం ఇంకా వ్యాపిస్తుందన్నది సంఘ్ పరివార్, బిజెపిల వ్యూహం. అందుకోసం ఆ ఇరువురిపై రకరకాలగా ఆరోపణలు, విమర్శలు తరచు చేస్తూ వస్తున్నారు. గాంధీజీపై విమర్శల పట్ల వ్యతిరేకత పెరుగుతుండటంలో ఆయనను పక్కన ఉంచి, నెహ్రూపై ఆరోపణలు పెంచుతున్నారు. గాంధీజీ, నెహ్రూలు విమర్శలకు అతీతులని కాదు. కాని ఆరోపణలు, విమర్శలు ఎవరు ఎవరిపై చేసినా అందుకు ఆధారాలుండాలి. ఆ విధంగా చూసినపుడు కశ్మీర్ విషయమై నెహ్రూ, పటేల్ పాత్రలు తెలుపు, నలుపు పద్ధతిలో గిరిగీసినట్లేమీ లేవు. పటేల్ జీవిత చరిత్రను, రికార్డులు, వ్యక్తిగత లేఖలు, ఇంటర్వ్యూల ఆధారంగా అతి సమగ్రంగా రచించిన వాడు, గాంధీజీ మనుమడైన రాజ్‌మోహన్ గాంధీ. ఆయన తను పేర్కొన్న ప్రతి అంశానికి ఆధారాలను ఉదహరించారు. వాటిని గమనించినపుడు ప్రధాని మోడీ వాదనలు పరిశీలనకు నిలవవు. కేవలం నెహ్రూను కించపరచి, దేశ ప్రజల దృష్టిలో తన విలువను తగ్గించి, బిజెపి భావజాలానికి అనుకూలుడని తాము భావించే పటేల్‌ను పైకెత్తటం కోసం ఆ విధంగా మాట్లాడుతున్నట్లు అర్థమవుతుంది. కశ్మీర్‌తోపాటు గల దేశ విభజన విషయంలోనూ నెహ్రూ, పటేల్ వైఖరుల గురించి వారు ఇదే విధంగా ప్రచారాలు చేస్తున్నారు. పటేల వ్యక్తిగత కార్యదర్శి, సన్నిహిత సలహాదారు అయిన వి. పి. మెనన్ రాసిన 'ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా', వి. శంకర్ రచన 'మై రెమినిసెన్సెస్ ఆఫ్ సర్దార్ పటేల్' వంటి గ్రంథాలను చదివితే కశ్మీర్‌పట్ల ఎవరి వైఖరి ఏమైనదీ స్పష్టమవుతుంది. ముస్లింలు ఆధిక్యతలో గల కశ్మీర్ విషయమై పటేల్ ఆసక్తి చూపకపోవటం దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించిన తర్వాత కూడా 1947 సెప్టెంబర్ 13 వరకు కొనసాగింది. ఆయన ఆ రోజు రక్షణ మంత్రి బల్ దేవ్ సింగ్‌కు లేఖ రాస్తూ, "ఒకవేళ (కశ్మీర్) వేరే డొమినియన్ (పాకిస్థాన్ అని భావం) లో చేరదలచుకుంటే" ఆ వాస్తవిక స్థితిని తాను గుర్తించగలనని చెప్పారు. తర్వాత అదే రోజు మధ్యాహ్నం, జునాగఢ్ విలీనాన్ని పాకిస్థాన్ అంగీకరించిన తర్వాతనే పటేల్ వైఖరి మారింది. జునాగఢ్ సంస్థాన పాలకుడు ముస్లిం, అక్కడి ప్రజలు మెజారిటీ హిందువులు. అటువంటి సంస్థానం పాకిస్థాన్‌లో విలీనమైనపుడు, హిందూ పాలకుడు, మెజారిటీ ప్రజలు ముస్లింలు అయిన కశ్మీర్‌ను ఇండియాలో ఎందుకు విలీనం చేసుకోరాదన్న నిర్ణయాన్ని పటేల్ అపుడు మాత్రమే తీసుకున్నారు. ఇందుకు భిన్నంగా, తమ పూర్వీకుల జన్మభూమి అయిన ఆ సుందర దేశాన్ని వదలుకోవటం నెహ్రూకు ఎప్పుడూ ఆమోదయోగ్యం కాలేదు. తన మిత్రుడైన షేక్ అబ్దుల్లా తోడ్పాటుతో కశ్మీర్ విలీనానికే నిరంతరం ప్రయత్నించారు. అందువల్ల, ఇటువంటి పలు పరిణామాలను విస్మరిస్తూ ప్రస్తుత రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించటం తగిన పనికాదు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**పామిడి, సూర్య వాస్తవం, నవంబర్ 7 :** గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలం గజరాంపల్లి సర్పంచ్ అచ్చన్న కుమారుడు అజయ్ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతపురం వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి,అనంతపురం జిల్లా,వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, గజనంపల్లి దేవేంద్ర తిప్పారెడ్డి, విశ్వనాథరెడ్డి విజయరామ్ రెడ్డి, రామారావు,నరసింహ, తుల్లా భాయ్, గారు, అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, పామిడి సూరి గజనంపల్లి రమేష్ , రంగనాయకులుపామిడి పట్టణ ఉపాధ్యక్షులు, తుల్ల బాయ్, కండ్లపల్లి, సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, రమేష్ కొత్తపల్లి,వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం



**గాండ్లపెంట, సూర్య వాస్తవం, నవంబర్ 7:** వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల కార్యక్రమ సదస్సు మరియు జాతీయ క్యాన్సర్ వ్యాధి పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గాండ్లపెంట మరియు మలమీదపల్లి మరియు కె.బి తాండాలో శుక్రవారం డాక్టర్ మహేశ్వర మారుతి మరియు సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఆధ్వర్యంలో వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల కార్యక్రమము మరియు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించుచు క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభతరం అవుతుందని తెలిపి క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యమని తెలిపి మంచి అలవాట్లు, ఆరోగ్య కరమైన ఆహారంతో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనవచ్చునని, క్రమం తప్పని వైద్య పరీక్షలు, ధూమపానం మరియు మత్తు పానీయాలకు దూరంగా ఉండి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని , 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ఇంటి వద్దనే వైద్య ఆరోగ్య సిబ్బంది వచ్చి పరీక్షలు చేస్తారు. ఈ అవకాశాన్ని ప్రజలు అందరు వినియోగించుకోవాలని మరియు డ్రై డే ఫ్రైడే పాటించి దోమల బారిన పడకుండ జ్వరాలు రాకుండ జాగ్రత్తలు పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమములో సూపర్ వైజర్ విజయ కుమారి, ఎమ్ ఎల్ హెచ్ పి షహనాజ్,శిరీష ఆరోగ్య కార్యాకర్తలు శ్రీనివాస రెడ్డి, ,నిర్మలమ్మ,సుభద్ర, భవానీ, ఆశా కార్యకర్తలు అమరావతి,రాజేశ్వరి, లక్ష్మీదేవి,అరుణ పాల్గొన్నారు.



## తుఫాన్ బాధితులకు అండగా ఎమ్మెల్యే విజయశ్రీ



**సూళ్లూరుపేట, సూర్యవాస్తవం నవంబర్ 7:** మొంథా తుఫాన్ ప్రభావంతో జీవనోపాధి కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. శుక్రవారం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పలు తీర గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ "మొంథా తుఫాను కారణంగా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న ప్రజలకు ప్రభుత్వం భరోసా ఇస్తోంది. బాధిత కుటుంబాల పునరావాసం, ఆహార సదుపాయాలు, మరియు ఆర్థిక సాయం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం" అని తెలిపారు. ఈ సందర్భంగా 1742 మంది మత్స్యకార కుటుంబాలకు, సూళ్లూరుపేట మండలం మన్నారపోలూరు గ్రామానికి చెందిన 54 నేత కుటుంబాలకు ఆరు రకాల నిత్యావసర సరుకులు, ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ముందస్తు పరీక్ష.. క్యాన్సర్ నుండి రక్ష






- **డాక్టర్ అరుణ**

**గుంతకల్లు, సూర్య వాస్తవం, నవంబర్ 7:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తిలక్ నగర్‌లో ఏర్పాటు చేసి అవగాహన సదస్సు మరియు ర్యాలీ ద్వారా క్యాన్సర్‌పై విజయం - స్క్రీనింగ్‌తో సాధ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గంగాధర్, డాక్టర్ అరుణ మరియు కౌన్సిలర్ రామాంజ నేయులు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, డెమో సెక్షన్ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ ముఖ్యంగా సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవన శైలి లో మార్పులు రావడంతో ఎన్ సి డి ఎస్ 505 వ్యాధులు పెరుగుతున్నాయి. బి.పి, షుగర్ లతో పాటు ఈ రోజుల్లో క్యాన్సర్ కేసులు కూడా గణనీయం గా నమోదు అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తం గా ప్రతి సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తింప బడుతున్నాయి. వీటిలో చాలా కేసులు ఆలస్యం గా గుర్తించ బడటం తో రేడియో, కీమో చికిత్సలు తీసుకోవలసిన అవసరం రావడం, తిరిగి నయం చేయలేని స్థితి లో వుండటంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ పరిస్థితులలో పేషెంట్ తో పాటు కుటుంబాలు అధిక ఆర్థిక భారం, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్యాన్సర్ నివారించడానికి ఒకే ఒక పరిష్కారం "ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం మరియు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం". బి.పి., షుగర్ పరీక్షలు ఎంత ముఖ్యమని భావిస్తున్నారో, అదే విధంగా క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవడం లో వుండాలి సూచించారు. క్యాన్సర్ అంటే భయపడాల్సిన పని లేదు, ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం చేయగల వ్యాది ఇది అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామాంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాల పైబడిన ప్రతి పౌరునికి ఉచితంగా నోటి, రొమ్ము మరియు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోంది. ఈ పరీక్షలు చేయించుకోవడానికి మీ ఇంటి వద్దకు వచ్చే ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి సహకరించండి. అలాగే, మీ సమీపంలోని ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు పూర్తిగా ఉచితంగా చేయబడతాయి. ఇది కొందరికే వస్తుంది, నాకు రాదు అనే అపోహలు వదిలేయండి. ప్రజలందరూ ముందుకు వచ్చి ఈ పరీక్షలు చేయించుకోండి అని పిలుపునిచ్చారు. డివై హెచ్ ఈ ఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు మొహమాటం, బిడియంతో వెనుకంజ వేయకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలి. మీ వ్యక్తిగత వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. ఏమైనా అనుమానాస్పద లక్షణాలు వుంటే వారిని వెంటనే మెడికల్ కాలేజి ఆసుపత్రులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ కి రిఫర్ చేసి, వెంటనే ప్రత్యేక వైద్య సదుపాయం, ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గ్రేస్ పద్మలత, ఆరోగ్య కార్య కర్త బాబావలి, ఎంఓ అసిస్టెంట్ రియాజ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగనవాడి కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు

### ప్రజలకు అంకితం చేసిన టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి







**పామిడి, సూర్య వాస్తవం, నవంబర్ 7:** పామిడి పట్టణంలో తలవాల కట్ట దగ్గర నిట్టూరు నిలయంలో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు శ్రీ సరస్వతీ విద్యామందిరం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగాయి. వందేమాతరం గేయం అనేది మన జాతీయ గానం. ఇది బంకించంద్ర చటోపాధ్యాయ రాసిన ఆనంద మఠం అనే ఒక నవల లో ఒక ఆరు చరణాల గానం. ఇందులో మన భారతమాతను వర్ణిస్తూ కీర్తిస్తూ రాయబడింది. పాఠశాల ప్రబంధకారిణి సభ్యురాలు శ్రీమతి చంద్రిక ముఖ్య వక్త గా మాట్లాడారు. ప్రధానాచార్యులు ఆచార్యబృందం విద్యార్థులు ఇంకా కమిటీ పాల్గొన్నారు.విద్యార్థులు ఆచార్యులు అందరు కలిసి వందేమాతరం పూర్తి ఆరు చరణాలు పాడారు.

# ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వర్తించండి

### మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలి: జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 7:** పోలీసు అంటే భయం కాదు, నమ్మకం కలిగేలా సిబ్బంది పనిచేయాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం నాడు రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన నెలవారీ 'నేర సమీక్షా' సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా ప్రతి అధికారి పనిచేయాలి. గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను తరచుగా సందర్శించాలి. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలి. తప్పిపోయిన వారి కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, టెక్నాలజీ సాయంతో త్వరగా ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చాలి. నేర నియంత్రణలో కఠినత్వం చూపాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి. నిషేధిత మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలి. క్రికెట్ బెట్టింగ్‌లు, కోడి పందాలు, జూదం ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలి. అలవాటు పడిన నేరస్తులకు షీట్లు తెరవాలి. జైలు నుండి విడుదలైన పాత నేరస్థులపై, గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలి. రాత్రి బీట్లను పటిష్టం చేసి, పాత నేరస్థులను తనిఖీ చేయాలి. పెండింగ్ కేసులను, ముఖ్యంగా మర్డర్ కేసులను త్వరిత గతిన పరిష్కరించాలి. నేర పరిశోధనలో ఆధునిక టెక్నాలజీని, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించాలి. పోక్సో కేసుల్లో ఛార్జి షీట్ త్వరగా దాఖలుచేసి, ముద్దాయిలకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. వాట్సాప్, ఫేస్‌బుక్‌వంటి సామాజిక మాధ్యమాలపై నిరంతరం నిఘా ఉంచాలి. ముఖ్యమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి , రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే ఐపీఎస్ మదనపల్లి డిఎస్పీ యస్.మహేంద్ర, రాయచోటి డిఎస్పీ యం.ఆర్.కృష్ణమోహన్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## నేడు కనక దాస జయంత్యుత్సవం

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 7:** అన్నమయ్య జిల్లా కలెక్టరు సభా భవనంలో శనివారం ఉదయం 10 గంటలకు కనకదాస జయంతి ఉత్సవాలను అధికారుల లాంఛనాలతో జరపడానికి ప్రభుత్వం నిశ్చయించుకున్నది. కావున కురుబ కుల సోదరా సోదరీమణులు అందరూ ఈ జయంతి ఉత్సవములలో విరివిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు తరిగొండ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలా అన్నమయ్య జిల్లాలోని కురుబ సోదరులు అందరు పేరుపేరునా ఆహ్వానం అందిస్తున్న ము.ఈ సమావేశంలో రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు రాష్ట్ర కురుబ సంఘం ఉపాధ్యక్షుడు లయన్ కె నాగేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కే రవిశంకర్, అన్నమయ్య జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షులు, మురళి మరియు జిల్లా యువజన నాయకులు పాల్గొన్నారు.

# చేసిన అభివృద్ధిని చూపడానికి దమ్ము ఎందుకు..?

## ఎక్కడ సమావేశం పెట్టినా చర్చకు సిద్ధం - ఉద్వేగాలు సృష్టించే విధంగా ప్రవర్తించడం సరికాదు

## మంత్రి రాంప్రసాద్ రెడ్డి విమర్శలకు వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి కౌంటర్




**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 7:** వైయస్ జగన్ హయాంలో రాయచోటి ప్రాంతంలో జరిగిన అభివృద్ధి అందరికీ తెలిసిందే. చారిత్రాత్మకంగా అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ఏర్పాటు చేసుకోగలిగాము. అటువంటిది కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే విధానాల అవలంబిస్తూ ఉద్వేగాలు సృష్టించే విధంగా మాట్లాడడం సరికాదు అని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటిలో విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం రాయచోటి అభివృద్ధిపై, వైఎస్ఆర్సిపి నాయకులపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేసిన విమర్శలకు ఆయన స్పందించారు. వైయస్ జగన్ హయాంలో రాయచోటి నియోజకవర్గం లో జరిగిన అభివృద్ధిని చూపించుకోవడానికి దమ్ము, ధైర్యం అవసరం లేదన్నారు. అధికారంలో ఉన్న మీరు అన్ని శాఖల అధికారులు కూడా పిలిపించుకొని సమావేశం ఏర్పాటు చేస్తే జరిగిన అభివృద్ధిని నోటి మాటలతో చెప్పేందుకు నేనొక్కడినే చర్చకు వచ్చేందుకు సిద్ధమని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చెప్పుకునేందుకు చూపించేందుకు నేను సిద్ధమని తెలిపారు. దేవుడు దయతో పెద్ద పదవిని అలంకరించారని ఇటువంటి సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి కానీ ఉద్వేగాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సరికాదని మంత్రి రాంప్రసాద్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఈ ప్రాంతం గురించి చులకనగా మాట్లాడిన ఆదోని ఎమ్మెల్యేను అసెంబ్లీలో మీరు ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. దీంతోపాటు ఇంట్లో పడుకున్నా జరిగే పనులు జరుగుతాయన్నడం ఎంతవరకు సమంజసమో వారికే తెలియాలి అన్నారు.

**జిల్లా విభజన ఆపేసేందుకు కృషి చేయాలని హితవు**

కనిపిస్తున్న అభివృద్ధిపై విమర్శలు కాకుండా పస్తుతం అన్నమయ్య జిల్లా విభజన జరుగుతుందని వస్తున్న వార్తల గురించి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత వాసిగా రాయచోటి జిల్లా కేంద్రంగా చేయడానికి తాను ఎంతో కృషి చేశాను అన్నారు. ఇప్పుడు జిల్లాను విభజించేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంటుందని ఈ ప్రాంతం నుంచి పదవిలో ఉన్నవారు జిల్లా విభజన జరగకుండా, జిల్లా కేంద్రం రాయచోటి నుంచి తరలించకుండా క్యాబినెట్లో చర్చించాలని మంత్రికి హితవు పలికారు. అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లెను వేరు చేస్తే అన్నమయ్య జిల్లాకు భవిష్యత్తు ఉండదని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

# సీహెచ్‌సీలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం





**తనకల్లు, సూర్య వాస్తవం, నవంబర్ 7:** మండలం లోని సామాజిక ఆరోగ్య కేంద్రం నందు రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు "రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం" అనే కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి ముసల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. ఆయన ప్రభుత్వ ఉద్యోగులు పడుతున్నటువంటి సమస్యల పైన ,అలాగే ఆర్థికపరమైన అంశాలు ,డిఏలు, ఐ ఆర్,పిఆర్సి ,సరెండర్ లీవులు, ఎపిజిఎల్ఐ లోన్లు మరియు రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిల గురించి ఉద్యోగులకు సవివరంగా వివరించడం జరిగింది. తర్వాత ఉద్యోగస్తులకు ఎవరికైనా ఎటువంటి ఇబ్బంది కలిగిన నేరుగా నాకు తెలియజేస్తే ఉద్యోగస్తులందరికీ అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇవ్వడం జరిగింది. ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు అనేక రకాలైనటువంటి సమస్యలతో సతమతమవుతున్నారని ఆర్థికపరమైన ఆర్థికేతర అంశాలలో ప్రభుత్వం చొరవ చూపాలని తెలియజేయడం జరిగింది.తొందరలో ఐ ఆర్ ప్రకటించాలని కోరడం జరిగింది. కదిరి తాలూకా అధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ త్వరలో తాలూకా బాడీని, మరియు మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తామని, ఉత్సాహవంతులైనటువంటి ఉద్యోగులకు సేవ చేయాలని దృక్పథం కలిగి ఉన్నటువంటి వారిని ఆహ్వానిస్తున్నామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి హెచ్ సి డాక్టర్లు భాస్కర్ నాయక్ ,డా. రమేష్ డా.సాధియా, కదిరి తాలూకా నుండి ఆర్గనైజింగ్ సెక్రటరీ హరి ప్రసాద్ , వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ , నాగమణి మరియు వైద్య ఆరోగ్య ఉద్యోగులు హెడ్ నర్సు, స్టాఫ్ నర్సులు ల్యాబ్ టెక్నీషియన్ , ఫార్మసిస్ట్, మహిళా ఆరోగ్య కార్య కర్తలు, మగ ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 7:** ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం పీలేరు మండలం తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్... ఆసుపత్రికి సంబంధించిన ఓపి రిజిస్టర్, డిస్పెన్సరీ రిజిస్టర్ తదితర రిజిస్టర్ లను పరిశీలించి ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నలు అడిగారు. చిన్న పిల్లలకు టీకాలు ఎప్పుడు ఎప్పుడు వేస్తున్నారు ఎలా వేస్తున్నారు వంటి ప్రశ్నలు అడిగారు. చిన్న పిల్లలకు వేసే టీకాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారా లేదా టీకాలు వేసే తేదీలపై ప్రజలకు ముందుగానే తెలియజేస్తున్నారా లేదా వంటి ప్రశ్నలు అడిగారు. రక్తహీనత ఉన్న 68 కేసులు ఎందుకు వచ్చాయని ఆసుపత్రి సిబ్బందిని అడిగి కొత్త హీనత లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల ఇంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఎందుకు జరగలేదని ఆసుపత్రి సిబ్బందిని అడిగి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరగాలని ఆదేశించారు. గడువు ముగిసిపోయిన ఇంజక్షన్లు లేదా మందులు ఆసుపత్రిలో ఉండకూడదని ఆదేశించారు. ఆసుపత్రిలో వసతులు బాగా ఉండాలని, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు





# వైయస్ జగన్‌ను కలిసిన మహమ్మద్ తౌఫీఖ్



**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 7:** నెల్లూరు నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడి హోదాలో అధినాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని, నెల్లూరు నగర ఇన్చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో మర్యాదపూర్వకంగా కలిసిన మహమ్మద్ తౌఫీఖ్. ఈ సందర్భంగా జగనన్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై తలపెట్టిన కోటిసంతకాల ప్రజా ఉద్యమాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్ళాలన్నారు. ప్రైవేటు పరమైతే జరిగే నష్టాలను ప్రజలకు వివరించాలని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. అదేవిధంగా పార్టీపరంగా వచ్చే ప్రతి పిలుపుపై కార్యక్రమాలను చేస్తుండాలని సూచించారని తెలిపారు.

# శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో 'వందేమాతరం'

- వేడుకగా కాలేజీ 25వ వార్షికోత్సవం



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 7:** భారత జాతీయ గీతం "వందేమాతరం" కు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, శుక్రవారం నాడు శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, రాయచోటిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ కె. పి. వి. సుబ్బయ్య మాట్లాడుతూ, పేద మరియు మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో 2001 సంవత్సరంలో శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించామని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగ అవకాశాలను పొందేలా నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. అలాగే, 2024 సంవత్సరంలో కళాశాల నాక్ (%చీూూజ%) గుర్తింపు మరియు ఆటోనమస్ హోదా పొందడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీ హోదా సాధించడానికి కళాశాల సమష్టిగా కృషి చేస్తోందని సుబ్బయ్య తెలిపారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణనిచ్చిన జాతీయ గీతమని, దేశభక్తి భావనను మేల్కొలిపే శక్తివంతమైన నినాదమని పేర్కొన్నారు. 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం భారత చరిత్రలో అపూర్వ స్థానం సంపాదించిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సమూహంగా వందేమాతరం గీతాన్ని ఆలపించి, దేశభక్తి గీతాలు మరియు నినాదాలతో కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. అధ్యాపకులు విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డా. వి.వెంకట రమణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లాస్థాయి పోటీల్లో మాసాపేట విద్యార్థుల ప్రతిభ



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 7:** మాసాపేట పి.ఎం. శ్రీ. సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈరోజు డైట్ కళాశాలలో జరిగిన ఒకేషనల్ స్కిల్ కాంపిటీషను లో బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్ మరియు ఇన్సూరెన్స్ విభాగమందు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. పాఠశాల ఒకేషనల్ టీచర్ దేవేంద్ర గైడెన్స్ లో రూపొందించిన' ఏ.టీ.ఎం సిములేషన్ బోర్డ్ అండ్ హౌటు ప్రివెంట్ ఫ్రాడ్ 'అన్న ప్రాజెక్టును రూపొందించిన పదవ తరగతి విద్యార్థులు కార్తీక్,భానుతేజ,రిషి మరియు సంతోష్ లు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందారు. పాఠశాలలో వీరికి జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మనోహర్ బాబు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఇటువంటి పోటీలలో పాల్గొని జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం పొందినందుకు ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. జ్ఞానాధారిత ప్రపంచంలో ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే వృత్తి నైపుణ్యాలను అలవరచుకోవాలని తద్వారా వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తమ విద్యార్థులు ఈ స్థాయికి చేరుకున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుగవాసి ఆనందబాబు, కమిటీ సభ్యులు మరియు వంట ఏజెన్సీ అధ్యక్షులు గిరి విద్యార్థులను ఒకేషనల్ ఉపాధ్యాయులు దేవేంద్ర లను అభినందించారు.





## వందేమాతరం గేయానికి 150 ఏళ్లు

**లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, నవంబర్ 7:** వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని గ్లోబల్ పబ్లిక్ స్కూల్ నందు కరెస్పాండెంట్ దాక్షాయని ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025తో వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి అన్నారు.మన జాతీయ గేయం 'వందే మాతరా'న్ని 1875 నవంబరు 7న అక్షయ నవమి శుభ వేళ బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఆయన నవల ఆనందమఠ్‌లో భాగంగా బంగదర్శన్ అనే సాహిత్య పత్రికలో వందే మాతరం మొదటిసారి కనిపించింది.బలానికి, శ్రేయస్సుకు, దైవత్వానికి స్వరూపంగా మాతృభూమిని కీర్తించే ఈ గేయం దేశ ఐక్యత, ఆత్మగౌరవ స్ఫూర్తికి కవితాత్మక వ్యక్తీకరణ అన్నారు. అనతికాలంలోనే ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా నిలిచింది అని స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర గీతం ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చింది అని సామాన్యులనూ సమరయోధులుగా మార్చింది అని తెలిపారు..బీబీసీ వరల్డ్ సర్వీస్ నిర్వహించిన అంతర్జాతీయ పోల్‌లో ప్రపంచ ప్రసిద్ధ జాతీయ గేయాల్లో రెండో స్థానం అందుకుంది వందేమాతరం అని అన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థి దారుణ హత్య కలకలం

**బి.కొత్తకోట, సూర్య వాస్తవం, నవంబర్ 7:** బి.కొత్తకోట మండలంలో విద్యార్థి దారుణ హత్య శుక్రవారం ఉదయం వెలుగు చూడటం తీవ్ర కలకలం రేపుతోంది. మండలంలోని గోళ్ళతోపు పంచాయతీ, గుడిసివారిపల్లి కు చెందిన లేట్ వెంకట శివారెడ్డి కొడుకు జయ ప్రకాష్ రెడ్డి (25), కురబలకోట మండలం, అంగళ్లు లోని మిట్స్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బి.కొత్తకోట మండలం, కనిగలతోపు సమీపంలోని ఉండే కూని తోపు వద్ద బ్రాందీ షాపులో మద్యం పూటుగా సేవించి, పథకం ప్రకారం జయప్రకాష్ రెడ్డిని కిరాతకంగా కొట్టి చంపి హత మార్చారు. అనంతరం మృతదేహాన్ని తీసుకొచ్చి గుడిసివారిపల్లి మార్గంలోని సిసిరోడ్డుపై పడేసి పరారయ్యారు. శుక్రవారం వేకువజామున ఈ సంఘటన జరగడంతో ఉదయం ఆరున్నర గంటలకు అటుగా వస్తున్న స్థానికులు గుర్తించి, హత్య జరగడాన్ని చూసి ఉలిక్కిపడ్డారు. స్థానికులు బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలం వద్దకు సీఐ గోపాల్‌రెడ్డి చేరుకుని క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ సాయంతో వేలి ముద్రలను, ఆధారాలను సేకరించారు. అనంతరం జాగిలాలు మద్యం షాపు వద్దకు వెళ్లడంతో అక్కడ ఉన్న రెండు కార్లను హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య కేసులో 8 మంది పాల్గొన్నట్లు సమాచారం. ఈ హత్య ను కన్నతల్లె తన ప్రియుడితో కలిసి కిరాయిలతో చేయించిందని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో



హత్యకు గురైన జయప్రకాష్ రెడ్డి తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టు మార్టం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపాల్ రెడ్డి తెలిపారు.





# సీవీ రామన్, బిపిన్ చంద్ర పాల్ జయంతి వేడుకలు

**గుత్తి, సూర్య వాస్తవం, నవంబర్ 7:** గుత్తి పట్టణంలో నోబెల్ గ్రహీత, భారత రత్న సి.వి.రామన్ 137 వ జయంతి, స్వాతంత్ర్య సమర యోధుడు బిపిన్ చంద్రపాల్ 167వ జయంతి పెన్ష నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అ బూబాకర్,కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముందుగా సి.వి.రామన్,బిపి న్ చంద్ర పాల్ చిత్ర పటాలకు కో శాధికారి జెన్నే కుల్లాయిబాబు




పూల మాల వేసి నివాళులర్పిం చారు.వక్తలు మాట్లాడుతూ సి.వి.రామన్ తమిళనాడులో జన్మించారు. ఈయన వ్యవసాయ కుటుంబంనకు చెందిన వారు.ఈ యన 18వ ఏ టనే తాను రాసిన కాంతికి సంబంధించిన ధర్మాలపై పరిశోధన వ్యాసం లండన్ మ్యాగజైన్ లో ప్రచురితమైనది.ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నేను నా మాతృ భూమిలో నిజ మైన సైన్స్ నిర్మాణం చేయగలననుకున్నాను అంటూ చివరి వరకు భారత దేశంలో సైన్స్ అభివృద్ధికి కై పాటు పడ్డారు.మరియు బిపిన్ చంద్రపాల్ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన పాత్ర దారులైన లాల లజపతి రాయ్,బాలగంగాధర్ తి లక్,లాల్ బాల్ పాల్ అని పిలిచే వారు.ఇతను బెంగాల్ విభజన కు వ్యతిరేకంగా పోరాడారు.జాతీ యోద్యమ పత్రిక వందే మాతరం ను స్థాపించారు అని కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. అలాగే వందే మాతరానికి 150 వసంతాలు పూర్తి చేసుకున్న సం దర్భంగా పెన్షనర్స్ అందరము క లసి వందే మాతరం గీతాన్ని ఆల పించాము.ఈ కార్యక్రమంలో ప్రెసి డెంట్ అబూబాకర్, కోశాధికారి జె న్నే కుల్లాయిబాబు, సెక్రెటరీ రామ్‌మోహన్, వైస్ ప్రెసిడెంట్ షైక్షావలి, నారాయణరెడ్డి, గోవిందప్ప, దేవ దాస్, చెన్నారెడ్డి, లక్ష్మి నారాయణ రెడ్డి, శామ్యూల్, నరసింహులు త దితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ప్రతిష్టాపన కార్యక్రమాలు



**గాండ్లపెంట, సూర్య వాస్తవం, నవంబర్ 7:** భక్తిశ్రద్ధలతో ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి నూతన ఆలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం రోజు సందర్భంగా మండల కేంద్రంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేదమంత్రాల నడుమ వేద పండితులు భక్తిశ్రద్ధలతో సుప్రభాత సేవ, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, శతృద్రియ హెూమం, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, అన్న ప్రసాద వితరణ జరిగాయి. అనంతపురం పట్టణ వాస్తవ్యులు దేవరకొండ బాలాజీ శర్మ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టా కార్యక్రమాలు గత రెండు రోజులుగా జరుగుతూ ఉన్నాయి కావున యావన్మంది భక్తులు వచ్చి స్వామివారి సేవలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరుతున్నాం. శ్రీ చిన్నమిట్ట ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులు లక్ష్మీ నరసింహ గౌడ్ స్వామి, రఘునాథ్ రెడ్డి స్వామి, మరియు గాండ్లపెంట గ్రామ పెద్దలు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

# వందేమాతరం గీతాలాపన కార్యక్రమం

**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 7:** దేశ స్వాతంత్ర్య సమరాన్ని ఉత్తేజపరిచిన బంకిమ్ చంద్ర ఛటర్జీ చే విరచితమైన మన దేశ జాతీయ స్ఫూర్తిదాయక గీతం వందేమాతరం గీతానికి 150 ఏళ్లు అయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహెూత్సవ ఆహ్వాన కమిటీ గోరంట్ల ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమం గోరంట్ల పోలీస్ పేరేడ్



గ్రౌండ్ లో నిర్వహించారు, ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించిన గేయం యుద్ధరంగంలో పోరుబాటలో ఉద్భవించిన పాట కాదని ఛటర్జీ కలం నుంచి ప్రశాంత దృఢచిత్తంతో జాలువారిన గీతం అని స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి శ్లోకంగా నిలిచి నేటికీ జాతీయ గేయంగా బాసిల్లుతోంది, భారతీయ పురాతన సాంస్కృతిక మూలాలు ఈ గేయ రచనకు ప్రేరణానిచ్చాయి, భారతదేశమంటే కేవలం భూభాగం కాదని యుగాలుగా పరిఢవిల్లిన నాగరికత అనీ, ఉమ్మడి సంస్కృతి విలువలు సౌర్యత్యాగాలను పంచుకున్న భారత మాత బిడ్డల చిరకాల ఆవాసమని , భారతదేశం అంటే మట్టి కాదని కర్తవ్యం అంకిత భావాలతో పునీతమైన పుణ్యతీర్థం అనిప్రబోధించింది అని, వందేమాతరం గేయం దేశ ప్రజల దివ్యగీతంగా అజరామరంగా నిలిచిపోయిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆజాదీకా అమృత్ మహెూత్సవ్ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ సోమ శేఖర్‌శర్మ, సెక్రటరీ భక్తవత్సలం, ట్రెజరర్ బలరాం గుప్తా, సభ్యులు దామోదర్ రెడ్డి, రిటైర్డ్ ఎం ఈ ఓ లు రెడ్డికేశవ ప్రసాద్, గోవిందరెడ్డి, శ్రీరాములు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ జనార్ధన్ రెడ్డి, ఫణి కుమార్, ఎస్ ఐ ఉమాదేవి, డిప్యూటీ ఎంపిడిఓ దేవదానం, లయన్స్ క్లబ్ మెంబెర్స్ మెంబెర్స్ రాజేష్, నాగరాజు, దస్తగిరి, డాక్టర్ ఫణి కుమార్, హిస్టరీ లెక్చరర్ రామాంజనేయులు, మేదర శ్రీనివాసులు, ఐ టి ఐ ప్రిన్సిపాల్ శివప్ప నాయక్, ఉపాధ్యాయులు సురేష్, చంపకమాలిని, బాలికల పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, కృష్ణ దేవరాయ జూనియర్ కళాశాల విద్యార్థులు, పురప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు



**రాయచోటి, సూర్య వాస్తవం, నవంబర్ 7:** అర్బన్‌స్టేషన్ సమీపంలోని లైసెన్సులు,హెల్మెట్లు,లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించిన ఎస్సై. మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు.అని హెచ్చరించారు. అంతే కాకుండా ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్ల పైనే కాకుండా,వారికి ద్విచక్ర వాహనాలు ఇచ్చిన తల్లితండ్రులపై ,కూడా చట్టపరమైన కేసు నమోదు చేయడం జరుగుతుంది అన్నారు.

## వీఎస్‌యూ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్

**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 7:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వి.ఎస్.యూ) కెమిస్ట్రీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి ఏ. వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ లభించింది. కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ త్రివేణి పర్యవేక్షణలో ఏ నావెల్ వన్ పోస్ట్ సింథసిస్ ఆఫ్ ఆఫ్ బెంజోఫ్యూసేడ్ ఫైవ్ అండ్ సిక్స్ మెంబర్డ్ హెతెరాక్లిక్ సిస్టమ్స్ అనే అంశంపై వెంకటేశ్వర్లు సమర్పించిన పరిశోధన గ్రంథానికి (థీసిస్) యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, డాక్టరేట్ సాధించిన వెంకటేశ్వర్లును, ఆయన పరిశోధన మార్గదర్శకురాలు డాక్టర్ పి. త్రివేణిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిశోధన రంగంలో విశిష్టమైన ప్రగతిని సాధిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు పరిశోధనల పట్ల మరింత ఆసక్తి చూపించి, నూతన ఆవిష్కరణలకు దారి తీసే విధంగా నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ టి.త్రివేణి ప్రోత్సాహంతో ఈ పరిశోధన విజయవంతంగా పూర్తి కావడం అభినందనీయమన్నారు. పరిశోధకుడు అన్నవరపు వెంకటేశ్వర్లు భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపకులపతి



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్. విజయ, కెమిస్ట్రీ విభాగ అధిపతి త్రివేణి, అధ్యాపకులు ఆచార్య టి.వీరారెడ్డి, డాక్టర్ వై. విజయ, పరిశోధక విద్యార్థులు వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహిళలను భావోద్వేగానికి గురి చేస్తున్న "ది గర్ల్ ఫ్రెండ్"

**నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్** శెట్టి జంటగా నటించిన "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా ఈ రోజు గ్రాండ్ రిలీజ్ కు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ఈ చిత్రాన్ని ఆదరిస్తున్నారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందించారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహించిన "ది గర్ల్ ఫ్రెండ్" సూపర్ హిట్ అయిన నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ - "ది గర్ల్ ఫ్రెండ్" లాంటి మంచి సినిమాను మీడియా మిత్రులు తమ బాధ్యతగా ప్రేక్షకుల్లో తీసుకెళ్లి, సపోర్ట్ చేస్తారనే నమ్మకాన్ని నేను సినిమా రిలీజ్ ముందు వ్యక్తం చేశాను. మేము ఆశించినట్లే మీడియా మిత్రులంతా మంచి రేటింగ్స్ తో "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాకు అండగా నిలబడ్డారు. మీ అందరికీ థ్యాంక్స్ చెప్పేందుకే ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేశాం. మా సినిమాకు మార్నింగ్, మ్యాట్నీ నుంచి కలెక్షన్స్ పెరుగుతూ వస్తున్నాయి. మహిళలు ఈ సినిమా చూసి భావోద్వేగానికి గురవుతున్నారు. మనం చేసినదానికి ఇది చాలు కదా అనిపించింది. ప్రేమికులైనా, భార్యా భర్తలైనా వాళ్లు ఒకరిపట్ల మరొకరి రిలేషన్ ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో రెండూ ఈ చిత్రంలో చెప్పారు. అమ్మాయిల్లో ఉండే బాధను బయటకు తీసుకువచ్చే ప్రయత్నాన్ని దర్శకుడు రాహుల్ చేశారు. ఈ సినిమా విజయానికి మొదటి కారణం దర్శకుడే. హీరో హీరోయిన్స్ ఇద్దరూ ఏ వంకా పెట్టలేనంత అద్భుతంగా నటించారు. ఈ సినిమాను మన మీడియా మిత్రులు ఇంకా బాగా ప్రేక్షకుల దగ్గరకు చేరుస్తారని కోరుకుంటున్నా. అన్నారు.



హీరో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ మా మూవీకి సపోర్ట్ చేస్తున్న మీడియా మిత్రులకు థ్యాంక్స్. సినిమా చూసి బయటకు వచ్చిన వాళ్లు నా వైపు చూస్తున్నారు. చాలా మెసేజ్ లు వస్తున్నాయి. సినిమా బాగుందంటూ రివ్యూస్ పంపుతున్నారు. మా మూవీ చూసి థియేటర్ లో ఒక్క విక్రమ్ బెటర్ అయితే చాలు అనుకున్నాం. ఎంతోమంది తమ జీవితాల్లోనూ ఇలాంటి సిచ్యువేషన్ ఎదుర్కొన్నామని, ఇలా ప్రవర్తించామని అంటున్నారు. ప్రేక్షకుల దగ్గర నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. చూడని వారు ఉంటే "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాను వెంటనే చూడండి. అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ మాట్లాడుతూ "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాను సక్సెస్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఈ జర్నీలో నాకు సపోర్ట్ గా నిలిచిన మా టీమ్ అందరికీ థ్యాంక్స్. అన్నారు.

ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ మాట్లాడుతూ మా మూవీకి షో బై షో కలెక్షన్స్ పెరుగుతున్నాయి. పాజిటివ్ టాక్ స్ప్రెడ్ అవుతోంది. ప్రేక్షకులతో పాటు మీడియా మిత్రులకు కూడా మా మూవీ బాగా నచ్చింది. ప్రీమియర్ షో తర్వాత మీడియా నుంచి వచ్చిన రెస్పాన్స్ చూసి హ్యాపీగా ఫీలయ్యాం. అన్నారు.

కాస్ట్యూమ్ డిజైనర్ శ్రావ్య వర్మ మాట్లాడుతూ "ది గర్ల్ ఫ్రెండ్" మూవీకి వస్తున్న రెస్పాన్స్ మా టీమ్ అందరికీ సంతోషాన్ని ఇస్తోంది. ఈ చిత్రంలో నేను భాగమయ్యే అవకాశం కల్పించిన డైరెక్టర్ రాహుల్, ప్రొడ్యూసర్ ధీరజ్, విద్య గారికి థ్యాంక్స్. అన్నారు.



## అట్టహాసంగా రెవెన్యూ క్రీడా సంబరాలు

- ప్రారంభించిన సిసిఎల్ఎ స్పెషల్ సెక్రటరీ జి జయలక్ష్మి




**అనంతపురం, సూర్యవాస్తవం :** ఎపి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా సంబరాలు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. మూడు రోజుల పాటు అనంతపురం నగరంలోని ఆర్‌డిటి క్రీడా గ్రామంలో ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ క్రీడలను సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ గీతాలాపన జరిగింది. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన రెవెన్యూ క్రీడాకారుల బృందాలు మార్చ్‌ఫాస్టు నిర్వహించాయి. ఈ మార్చ్‌ఫాస్టులో కాకినాడ మొదటి స్థానం, అనంతపురం ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి మూడవ స్థానం, నంద్యాల నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ బృందాలను సిసిఎల్ఎ చీఫ్ కమిషన్ జి జయలక్ష్మి సత్కరించారు. మైదానంలో దిగి జయలక్ష్మి క్రికెట్ బ్యాట్ పట్టి బ్యాటింగు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి రెవెన్యూ ఉద్యోగులు ఇక్కడికి విచ్చేసి ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గనడం అభినందనీయమన్నారు. అనంతరం అవుట్‌డోర్, ఇండోర్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఉమ్మడి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ నారాయణ శర్మ, మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డిఆర్‌ఓ మలోల, సత్యసాయి జిల్లా డిఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఎపి రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేశ్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గన్నారు.

# ఏసీఏ అండ మరువలేనిది

## భారత మహిళా క్రికెట్ క్రీడాకారిణి శ్రీచరణి



**మంగళగిరి, సూర్యవాస్తవం:** ఇండియా ఉమెన్స్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ కష్టం, వారి అనుభవం తమకెంతో ఉపయోగపడిందని మహిళా క్రీడాకారిణి శ్రీచరణి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరులోని ఎసిఎ క్రికెట్ స్టేడియంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమకు మద్దతు తెలిపిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన క్రికెట్ జీవితంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఎసిఎలో శిక్షణ తీసుకున్న తాను ప్రొఫెషనల్ క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన ఐదేళ్ల తర్వాత భారత జట్టులో స్థానం దక్కిందని తెలిపారు. వరల్డ్ కప్ ఫైనల్స్ ఆడాలనే సంకల్పంతో జట్టుమొత్తం ప్రయత్నించిందని, చాలా సమస్యలు ఎదుర్కొన్నా తిరిగి నిలబడ్డామని, కప్ అందుకోవడం తన జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని అన్నారు. ఆడపిల్లల క్రికెట్ పట్ల ఇప్పుడు తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు వచ్చిందని, చాలా మంది తనకు ఫోన్ చేసి తమ అమ్మాయిలు క్రికెట్ కెరీర్‌ను ఎలా మొదలు పెట్టాలో అడుగుతున్నారని చెప్పారు. కడపకు చేరుకున్న శ్రీచరణిని ఘనంగా సన్మానించారు.

**త్వరలోనే మహిళ క్రికెట్ అకాడమీ : శివనాథ్**

శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే మహిళా క్రికెటర్లకు శ్రీచరణి ఆదర్శమన్నారు. ఎసిఎ తరఫున త్వరలో మహిళ క్రికెట్ అకాడమీ ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ఎసిపి తరఫున మహిళ క్రీడాకారులకు ప్రోత్సహించే విధంగా వైజాగ్‌లో మిథాలీ రాజ్ పేరుతో ఒక స్టాండ్ ప్రారంభించామని చెప్పారు.



# శివాశీస్సులతో కార్తీకమాస లక్ష దీపోత్సవం





నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 7: కార్తీకమాసం సందర్భంగా ప్రజలకు కార్తీకమాస ఫలితాలను అందించేందుకు కార్తీకమాస లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులకు పరమేశ్వరుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఆయన పాల్గొని పండరీనాథ్ , నాగేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల క్షేమం కోసం ఇంతటి



మహాకార్యాన్ని నిర్వహిస్తున్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులకు శివ పార్వతుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేస్తుండడం హర్షించదగ్గ విషయం అన్నారు. గత పదేళ్లుగా ఎంతో వైభవోపేతంగా కార్తీకమాస లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను ప్రశంసించారు. ఇంత వైభవోపేతంగా జరిగే కార్యక్రమం మరొకటి లేదని ఆయన వ్యాఖ్యానించారు. కాబట్టి ప్రతి ఒక్కరు కార్తీకమాస లక్ష దీపోత్సవంలో పాల్గొని శివాశీసులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు.

# మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యం

**శ్రీ సత్యసాయి జిల్లాలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి : జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ అంకిత సురాన మహావీర్**

**పుట్టపర్తి, సూర్య వాస్తవం, నవంబర్ 7:** శ్రీ సత్యసాయి జిల్లాలో శాంతి భద్రతలు, మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తానని జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురాన మహావీర్ ఐపీఎస్ సూచించారు. శుక్రవారం శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ కార్యాలయం లోని అడిషనల్ ఎస్పీ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. మన్యం జిల్లా పార్వతీపురం సబ్ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహిస్తూ, అడిషనల్ ఎస్పీగా పదోన్నతిపై శ్రీ సత్య సాయి జిల్లాకు బదిలీ అయ్యారు. నేడు నూతన అడిషనల్ ఎస్పీగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఛాంబర్లో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు, అనంతరం జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ని ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అడిషనల్ ఎస్పీకి అభినందనలు తెలియజేశారు, జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఏఆర్ డిఎస్పి శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, మల్లికార్జున సిసి చిరంజీవి, ఎస్బిసిఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు, వలి, మహేష్,





రవికుమార్, సిఐలు , ఆర్ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది మర్యాదపూర్వకంగా అడిషనల్ ఎస్పీని చాంబర్లో కలిసి పూల బొకేలు అందజేసి అభినందనలు తెలియజేశారు, ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ,పోలీసు సిబ్బంది జిల్లా ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులు రక్షణే ప్రథమ కర్తవంగా పనిచేస్తానన్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు ఉన్న ప్రత్యేకతను కాపాడడానికి తప్పక కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ, పారదర్శకమైన పోలీసింగ్ అందిస్తానని పేర్కొన్నారు,సమర్థవంతమైన పోలీసింగ్ అనేది ప్రజల నమ్మకం మరియు సహకారంపై ఆధారపడి ఉంటుందని తాను నమ్ముతున్నట్లు తెలిపారు.

# కోటి సంతకాల సేకరణకు ప్రజల్లో విశేష ఆదరణ

**నగరంలో కోటి సంతకాల సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేసిన 5వ డివిజన్ నేతలు : ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి**





**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 7:** నెల్లూరు నగర నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన 5వ డివిజన్ ఇంచార్జ్ సానా సుబ్బారెడ్డి, వైసిపి నేతలను అభినందించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నెల్లూరు నగర నియోజకవర్గంలో విజయవంతం చేసిన 5వ డివిజన్ ఇన్ చార్జ్ సానా సుబ్బారెడ్డి ని డివిజన్ కో ఆర్డినేటర్ ఇబ్రహీం తో పాటు పలువురు వైసిపి నేతలను, వైయస్ఆర్సీపీ నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కింద పూర్తి చేసిన 2 వేల పత్రులను వారు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో వైఎస్ఆర్సిపి నేతలు ఉత్సాహంగా పనిచేసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేస్తుండడం సంతోషకరమని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ప్రజల నుంచి కూడా కోటి సంతకాలను సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుండడం అభినందనీయమని తెలిపారు .కోటి సంతకాల సేకరణ ఉద్యమ కార్యక్రమంతో, ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోక తప్పదన్నారు.

## విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన



**కనేకల్, సూర్య వాస్తవం, నవంబర్ 7:** జాతీయస్థాయి పోటీలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థిని గీతారెడ్డిని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభినందించారు. “అంతరిక్ష శాస్త్రం ప్రపంచస్థాయి అధ్యయనం” అనే అంశంపై ఢిల్లీలో నిర్వహిస్తున్న పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచారు. కనేకల్లు మండలం హనకనహాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గీతారెడ్డి పెయింటింగ్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచింది. రష్యన్ శాస్త్రవేత్త నుంచి శుక్రవారం గీతారెడ్డి ప్రథమ బహుమతి సర్టిఫికెట్ అందుకొన్నారు. అనంతపురం జిల్లా నుండి పోటీలకు ఎంపికైన గీతారెడ్డిని మంగళవారం అనంతపురం రైల్వేస్టేషన్లో కాలవ దీవించి పంపారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాయదుర్గానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని దీవించారు.

## యువకుడు ఆత్మహత్య



**మదనపల్లె, సూర్య వాస్తవం, నవంబర్ 7:** తల్లిదండ్రులు మందలించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. రెండో పట్టణ సీఐ రాజారెడ్డి కథనం మేరకు.. రామారావు కాలనీకి చెందిన నాగరాజు కుమారుడు శివ (24) పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివ ఎలుకల మందు తాగి ఆత్మహత్య కు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## అదనపు తరగతి గది ఏర్పాటు



**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 7:** గోరంట్ల మండలంలోని బుగానిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకే ఒక గది ఉండడంతో పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు తమ సొంత డబ్బు ఖర్చు పెట్టి ఒక తరగతి గదిని ఏర్పాటు చేశారు. ఈనూతన గదిని గోరంట్ల మండల విద్యాశాఖ అధికారి 2 గోపాల్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రిష్టప్ప, ఉపాధ్యాయురాలు రేష్మ. గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలుర ఉన్నత పాఠశాలకు విరాళం




**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 7:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశ ప్రజలకు వివరించడం ఏమనగా వందేమాతరం గీతాన్ని రచించి ఆలపించిన నేటికీ 150 సంవత్సరాల పూర్తి అయింది , ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ పూర్తి వందేమాతరం గీతాన్ని ఆలపించాలని ప్రధాన పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ నాయకత్వంలో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఆత్మ నిర్భయ భారత దేశంలో భాగంగా స్వదేశీ వస్తువుల్ని ఒకరు వాడాలని ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది అదేవిధంగా బిజెపి గోరంట్ల మండల శాఖ తరపున స్కూలుకు 5000 రూపాయలు విరాళం అందజేశారు.ఈకార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ, సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ మేదర శ్రీనివాసులు, వెంకటాచలం, హరీష్, వడల చంద్రశేఖర్రెడ్డి, శంకర, అశ్వర్థ ,కుర్ర ఆంజనేయులు, ఉపాధ్యాయులు నాగరాజు, ఓబులేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854